క్లుప్తంగా

ప్రసాద్ పథకం పనులకు క్లియరెన్స్

- సింహగిరిపై షెడ్ తొలగింపు



సింహగిరిపై షెడ్ తొలగిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా స్థలాలు క్లియర్ చేసి ఇచ్చే పనులకు దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టారు. సింహగిరిపై ఆధునిక క్యూ కాంప్లెక్స్ నిర్మాణ కోసం త్రిపురాంతకస్వామి ఆలయానికి సమీపంలోని షెడ్ తొలగిస్తున్నారు. అలాగే కొండదిగువ వరాహ పుష్కరిణి సత్రాన్ని కూడా మరికొద్ది రోజుల్లో తొలగించనున్నారు. ఈమేరకు అధికారులు పుష్కరిణి వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. పుష్కరిణి స్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.5 కోట్ల ప్రసాద్ స్కీమ్ నిధులతో ఆధునిక హంగులతో ప్రిలిగ్రిమ్స్ ఎమినిటీ సెంటర్ నిర్మించనున్నారు. ఇదిలా వుండగా స్వామివారి డోలోత్సవం జరిగే మండపం పురాతనమైంది కావడంతో తొలగించకూడదని నిర్ణయం తీసుకున్నారు.

వీల్ చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురానికి చెందిన ఎస్.కార్తికేయ నడవలేని స్థితిలో ఉండడంతో అతనికి వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ బాసటగా నిలిచారు. చిన్నారి కార్తికేయ తండ్రి ఎస్.వి.రాజారావుకు మంగళవారం ఎన్ఏడీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



వృద్ధుడి వివరాలు తెలుసుకుంటున్న మమత

విశాఖ విద్య: ఏ దిక్కూలేని ఓ వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న వ్యక్తి గురించి తెలుసుకున్న షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి చేరుకొని అతని వివరాలు తెలుసుకున్నారు. నేపాల్ దేశం గొల్గాం ప్రాంతం నుంచి వలస వచ్చిన ఆ వృద్ధుడికి ఇక్కడ ఆదరించే వారు లేకపోవడంతో రహదారులపైనే ఉంటున్నాడు. ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలికి గాయం కావడంతో నడవలేని స్థితిలో ఉన్న అతన్ని జీవీఎంసీ నిరాశ్రయుల షెల్టర్‌కు తరలించారు.

చంద్రనగర్‌లో అగ్ని ప్రమాదం

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... చంద్రనగర్ తుంపాల వారి వీధిలో నివాసముంటున్న తుంపాల వెంకటరావు ఇంట్లోని బెడ్ రూమ్‌లో ఇక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో వంట గదిలో ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. బెడ్‌రూమ్ నుంచి వస్తున్న మంటలను స్థానికులతో కలిసి అదుపు చేశారు. ఇంట్లో విలువైన సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల వరకు విలువైన వస్తువులు కాలిపోయాయని వాపోయారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

బాలలు ఉత్తమంగా ఎదగాలి

- 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి
- ఘనంగా బాలల దినోత్సవం



కరాస పాఠశాలలోబహుమతులు అందజేస్తున్న వుడా లే అవుట్ క్లబ్ ప్రతినిధులు



పచ్చదనం, రైతు విలువ చాటే వేషధారణల్లో విద్యార్థులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళవారం బాలల దినోత్సవాన్ని పశ్చిమ నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, సంస్థల్లో వేడుకగా నిర్వహించారు. పాఠశాలల్లో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భవిష్యత్ భారతావనికి బాలలే పటిష్టమైన పునాదులని చాటిచెప్పేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

మద్రిపాలెం వుడా లే అవుట్ క్లబ్ ఆధ్వర్యంలో 52వ వార్డు కరాస మున్సిపల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ నిర్వాహకులు, సభ్యులంతా కలసి విద్యార్థులతో కొద్దిసేపు గడిపారు. జవహర్ లాల్ నెహ్రూ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. చదువుల్లో రాణించిన విద్యార్థులకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. అదేవిధంగా విద్యార్థులందరికీ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉడా లే అవుట్ క్లబ్ నిర్వాహకులు కె. రాజేశ్వరరావు, పి. మురళీధర్, యుజే ఆర్. పట్నాయక్, సీహెచ్. విజయ ప్రసాద్, కె. నాగేశ్వరరావు, డి. లక్ష్మణరావు, టి. వెంకటాచారి, డి. జగదీష్ కుమార్, వి. గంటారెడ్డి, ఎస్. శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలకు నోట్ పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, అయితంశెట్టి గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు పాల్గొన్నారు.

నెహ్రూ చిత్రపటానికి నివాళి

విశాఖ విద్య:నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా 52వ వార్డు శాంతినగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల పట్ల అమితమైన ప్రేమ ఉన్న జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: రాష్ట్రంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో జరిగిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీఎంఎస్ ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, వారి సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 57వ వార్డు కంచరపాలెం పరిధి ఆశవానిపాలెం, 104 ఏరియా శ్యామ్‌నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముర్రు వాణి, పి.అప్పలరాజు, శ్యాం కుమార్‌రెడ్డి, 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, శ్రీనివాసరావు, రాజు, రుక్మిణి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధన పూజ



గోమాతకు పూజలు చేస్తున్న గ్రామాధ్యక్షుడు సత్యనారాయణ దంపతులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధిలోని కోదండ సీతారామ స్వామి, సంపత్ వేంకటేశ్వర స్వామి, దుర్గా ధనలక్ష్మీదేవి ఆలయాల్లో మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గోవర్ధన పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం గోమాత ప్రదక్షిణ, విశేష హారతి నిర్వహించారు. ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామ్‌శర్మలు గోమాతకు పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురునాథ్ యాదవ్‌కు సన్మానం



గురునాథ్‌ను సన్మానిస్తున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో పాదయాత్ర చేస్తున్న గురునాథ్ యాదవ్‌ను మంగళవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సన్మానించారు. శ్రీకాకుళం నుంచి పాదయాత్ర చేపట్టిన గురునాథ్ యాదవ్ సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బస చేశారు. తిరిగి పాదయాత్ర ప్రారంభించిన ఆయన ఎన్ఏడీ కొత్తరోడ్ వద్ద ఆడారి ఆనంద్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ అతన్ని సన్మానించారు. పాదయాత్రలో ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో 90వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. గురునాథ్ యాదవ్ అన్నారు. '2024లో మళ్లీ జగన్ సీఎం కావాలి' అనే కోరుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి తిరుపతికి పాదయాత్ర చేపట్టిన ఆయనకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గుణేశ్వరరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కు అభివృద్ధిపై సమీక్ష



సమీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వాకర్స్ పార్కు అభివృద్ధిపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం సమీక్షించారు. మద్రిపాలెం హైవేకు ఆనుకొని గ్రీన్ బెల్ట్‌లో పార్కును మరింత అభివృద్ధి చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను కోరారు. ఈమేరకు వాకర్స్ క్లబ్ నిర్వాహకులు, జీవీఎంసీ 5వ జోన్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం దీనిపై చర్చించారు. గ్రీన్ బెల్ట్‌ను మరింత ఆహ్లాదకరంగా తయారు చేసేలా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయటం ఎంతో ఉపయోగకరంగా ఉందని వాకర్స్ ప్రతినిధులు అన్నారు. యోగా శిక్షణకు అనువుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ డీఈ ఏడు కొండలకు సూచించారు. తాగునీటి సదుపాయం, విద్యుత్ లైట్లు వెలుగులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ ఏఈ ఎస్. ఉష, వాకర్స్ అధ్యక్షులు కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



పాల్గొన్న విద్యార్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనసూయాదేవి

మల్కాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ వారోత్సవాలు మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలెన్నో ఉన్నాయన్నారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు సుంకర చలపతిరావు, జి.కె.వి.రాజు, కె.సత్తిరాజు, టి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌న్యూకాలనీలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కనకరాజు ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నెహ్రూ జయంతి రోజున చిల్డ్రన్స్ డే, గ్రంథాలయ వార్షికోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మీసాల సత్యనారాయణ, శ్రీనివాసరావు, చిన్నారులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ఆక్రమణల తొలగింపు

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు నరవలోని భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు. నరవ సర్వే నెంబర్ 338లోని ప్రభుత్వ భూమి(గోర్జ)ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తహసీల్దార్ శ్యామ్ కుమార్ మంగళవారం ఆక్రమణలను పరిశీలించారు. తక్షణమే ఆయా ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను ఉపేక్షించబోమన్నారు. క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు కాల్స్

గోపాలపట్నం: ప్రయాణికుల సూచనలు, సలహాలు స్వీకరించడానికి మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఆర్ఎం కార్యక్రమానికి ఐదు ఫోన్ కాల్స్ వచ్చాయని డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. పలువురు విలువైన సూచనలు, సలహాలు తెలియజేశారన్నారు.

వచ్చిన కాల్స్ ఇవీ..

ఐ. నారాయణరావు అనే వ్యక్తి కొత్తవలస నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు బస్సు నడపాలని కోరారు.

➡ మద్దిలపాలెం నుంచి సింహాచలం కొండపైకి మెట్రోసర్వీస్ నడిపితే బాగుంటుందని అప్పన్న అనే వ్యక్తి సలహా ఇచ్చారు.

➡ పి. ప్రవీణ్ కుమార్ ఆరిలోవ నుంచి సింహాచలం వెళ్లేందుకు బస్సుసౌకర్యం కల్పించాలని కోరారు.

➡ కొత్త వలస నుంచి పాతపోస్టాఫీస్ వరకు సర్వీసు నడపాలని రామకృష్ణ కోరారు. - దొండపర్తి బస్టాప్‌లో బస్సులు సరిగా ఆపడం లేదని ఆర్. వెంకటరావు తెలిపారు. వీటిని పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం పేర్కొన్నారు.

89వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. అత్యవసర పనులు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా పనులు చేపట్టామన్నారు. ఇక్కడ 462 సచివాలయం సమీపంలో రూ.9లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, సంతోష్‌నగర్‌లో రూ.19.80 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అప్పలనరసయ్య కాలనీలో రూ.19.90 లక్షలతో కమ్యూనిటీ హాలు అదనపు అంతస్తు నిర్మాణానికి, రూ.20 లక్షలతో సంతోషనగర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, సంతోష్‌నగర్ సచివాలయం పరిధిలో రూ18.15లక్షలతో సీసీ రోడ్లు, కాల్వల నాగేంద్ర కాలనీలో 19.50లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, రూ.5 లక్షలతో సీసీ రోడ్లు పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించండి

వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి



మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సూచించారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం 57వ వార్డు పరిధి సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అరులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. ఇదే సమయంలో దొంగ ఓట్లు లేకుండా పరిశీలన చేయాలన్నారు. డబుల్ ఎంట్రీ లను గుర్తించి, వాటిని తొలగించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌లు జరిగే రోజుల్లో సచివాలయ కన్వీనర్లు, పార్టీ వార్డు స్థాయి నాయకులంతా అందుబాటులో ఉండి ఆ ప్రక్రియను పరిశీలించాలన్నారు. సమావేశంలో జీవీఎంసీ కో- ఆప్షన్ సభ్యుడు బెహర భాస్కరరావు, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం వైపే ప్రజలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- యల్లపువానిపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చంద్రనగర్ సచివాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఆనంద్ కుమార్, భాస్కరరావు

గోపాలపట్నం: ప్రజా ప్రభుత్వం వైపే ప్రజలంతా ఉన్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. యల్లపువానిపాలెం 465 సచివాలయం పరిధిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో ఉన్న మూడు సచివాలయాల పరిధిలో రూ.125 కోట్లు వెచ్చించి సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా రూ16.45కోట్లు ఈ ప్రాంత ప్రజలు 5146 మంది లబ్ధి పొందారన్నారు. నాడు- నేడు ద్వారా రూ.1.70కోట్లు వెచ్చించి పాఠశాలలు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వల్ల మహిళలు ఎంతో లబ్ధి పొందారని తామంతా ఆయన వెంటే ఉంటామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళారులను దరి చేరనివ్వొద్దు

గోపాలపట్నం: గత ప్రభుత్వంలో దళారుల వల్ల తీవ్రంగా నష్టపోయామని, ఈ సారి వారిని దరి చేరనివ్వొద్దని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. అప్పలనరసింహ కాలనీ 464 సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలిగిందన్నారు. ఇక్కడి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ15.14కోట్లు వెచ్చించామన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.70కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. మరో రూ.25 కోట్లతో పలు పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. సీఎం జగన్ పాలనలో పారిశ్రామికంగా ఎంతో ప్రగతి సాధించామని, భవిష్యత్తులో వాటి ఫలాలు ప్రజలు అందుతాయని అన్నారు. పోర్టుల నిర్మాణాలు త్వరితగతిన జరుగుతున్నాయని, వాటి వల్ల ఆయా ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మోసకారి మాటలతో మీ దగ్గరికి టీడీజేఎస్ పార్టీలు వస్తున్నాయని, వారిని గత హామీల గురించి నిలదీయాలని అన్నారు. 99శాతం హామీలు నెరవేర్చిన జగనే మళ్లీ మాకు కావాలని చెప్పాలన్నారు. 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, స్థానిక నాయకుడు మళ్ల శ్రీనివాసరావు, దాడి భాస్కరరావు, షేక్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక శోభ

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో దీపారాధన



లలితా సహస్రనామం జపిస్తున్న భక్తులు



విశ్వేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం



వల్లీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

విశాఖ విద్య: కార్తీక మాసం ప్రారంభంతో మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయాలను దర్శించుకొని స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయాల్లో కార్తీక శోభ ఉట్టిపడింది. ఎన్ఏడీ సెంటర్‌లోని ప్రమథ ఉమా విశ్వేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అదే విధంగా శ్రీ వల్లీదేవత ఉమామహేశ్వర స్వామి వారి ఆలయం, కరాసలోని శ్రీ సీతారామ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బుచ్చిరాజుపాలెంలోని శ్రీ బంగారమ్మ- శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామం జపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఇండస్ట్రియల్ శ్రామిక శక్తి లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరెడ్ల నానాజీ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఐవోసీ గేటు ఎదురుగా జరుగుతున్న విస్తరణ పనుల వద్ద యూనియన్ ప్రతినిధులు, సభ్యులతో కలసి మంగళవారం నిరసన తెలిపారు. నానాజీ మాట్లాడుతూ సంస్థలో రెండేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్నా, స్థానిక నిరుద్యోగులకు మాత్రం సంస్థ యాజమాన్యం, కాంట్రాక్టర్లు మొండి చెయ్యి చూపుతున్నారన్నారు. స్థానికేతర కార్మికులకు ఉపాధి కల్పిస్తూ.. స్థానిక నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. సంస్థ యాజమాన్యం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.